
నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 28 మే 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## మంచిర్యాల కలెక్టర్ పేరిట ఫేక్ మెసేజ్‌లు

మంచిర్యాల, మే 27, (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్ పేరిట వాట్సాప్ ద్వారా మెసేజ్‌లు రావడం కలకలం సృష్టించింది. కలెక్టర్ డీపీతో ఉన్న ఫేక్ వాట్సాప్ నంబర్ నుంచి మెసేజ్‌లు వస్తుండడంతో కలెక్టర్ జిల్లా అధికారులు, ప్రజలను అప్రమత్తం చేశారు. 94701389743 అనే వాట్సాప్ నంబర్ నుంచి మెసేజ్‌లు వస్తుండగా, దీన్ని ఎవ్వరూ నమ్మకూడదని, ఎవరికైనా మెసేజ్‌లు వస్తే వెంటనే నంబర్‌ను బ్లాక్ చేయాలని కలెక్టర్ సూచించారు.



మంచిర్యాల జిల్లా కలెక్టర్ డీపీతో వచ్చిన మెసేజ్

## రెబ్బెన్‌పల్లి పీహెచ్‌సీకి మెడికల్ పరికరాలు అందజేత


మెడికల్ పరికరాలు అందజేస్తున్న సభ్యులు

దండేపల్లి, మే27 : రెబ్బెన్‌పెల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు రూ.4 లక్షల విలువ చేసే మెడికల్ పరికరాలను వాషింగ్టన్ తెలుగు అసోసియేషన్, మీ హూవా ఫౌండేషన్, గివ్ ద నీడ్, హోప్స్ అండ్ స్మైల్, సన్‌షైన్ ఎండీ గురువారెడ్డి, దివాకర్‌రెడ్డి సోమవారం అందజేశారు. ఈసీజీ మెషిన్, ఆక్సీజన్ కాన్సన్ట్రేటర్‌లాంటి మెడికల్ పరికరాలతో పాటు, ఇన్వర్టర్, కంప్యూటర్, కుర్చీలు, డాక్టర్ టేబుల్, రిఫ్రిజిరేటర్ అందజేశారు.గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు వీరు ముందుకు రావడంపై పలువురు అభినందించారు. మండల వైద్యాధికారి సతీశ్‌కుమార్, నవజ్యోతి యూత్ సభ్యులు సంగనబట్ల రాజేంద్రప్రసాద్, కందుల అశోక్, బండ ప్రసాద్, ఎంబడి సురేందర్, చుంచు మల్లేశ్, బండ రాకేశ్ ఉన్నారు.


నిర్మానుష్యంగా ఆసిఫాబాద్‌లోని కలెక్టర్ చౌక్

# భగభగ మండే

### ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో సూర్యనిప్పులు

- ఆసిఫాబాద్‌లో 46.1, మంచిర్యాలలో 45.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- ఉక్కపోతతో సతమతమైన ప్రజలు
- గిరివెల్లిలో వడదెబ్బతో ఒకరి మృతి
- ముందు జాగ్రత్తలు తప్పనిసరంటున్న వైద్యులు

ఆసిఫాబాద్ టౌన్, మే 27 : కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో సోమవారం ఎండ దంచికొట్టింది. ఆసిఫాబాద్ జిల్లాలో గరిష్ఠంగా 46.1, మంచిర్యాల జిల్లాలో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం ఏడింటికే భానుడు భగభగ మండగా, సాయంత్రం ఏడింటి దాకా ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేసింది. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రాలేదు. మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. ప్రజానీకం శీతల పానీయాలను ఆశ్రయించడంతో పాటు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు కూలర్లు, ఏసీలను విపరీతంగా వాడుతుండగా, విద్యుత్ వినియోగం పెరిగింది. భానుడు నిప్పుల కుంపటిని తలపిస్తుండగా వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. మూగజీవాల పరిస్థితి దయనీయంగా ఉంది. మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి ఉండగా, ప్రజల్లో ఆందోళన కనిపిస్తున్నది.

#### ముందు జాగ్రత్తలే మేలు

వేసవిలో వడదెబ్బ నుంచి రక్షించకోవడానికి ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తలనొప్పి, కండరాలు పట్టేయడం, వికారం, కళ్లుతిగడం, వాంతులు చేసుకోవడంవంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ప్రతిరోజూ 5 నుంచి 6 లీటర్ల నీటిని తాగాలని, శీతల పానీయాలకు బదులు మజ్జిగ, నిమ్మ, కొబ్బరి బోండాలు, పుచ్చకాయలు, తాటి ముంజలు, దోసకాయ, లస్సీ, పండ్ల రసాలు తాగడం ఉత్తమమని, పండ్లు కూడా తీసుకోవాలని సూచిస్తున్నారు. బైక్ మీద వెళ్లేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, చిన్న పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు ఎండలో ప్రయాణం చేయకూడదని, తప్పనిసరి పరిస్థితుల్లో గొడుగు పట్టుకొని వెళ్లాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలితే ఓఆర్ఎస్ పొడిని కలిపి తాగించాలని, అది దొరకని పరిస్థితుల్లో నీటిలో కొంచం ఉప్పు లేదా పంచదార కలుపుకొని తాగాలని, అపస్మారక స్థితిలోకి వెళ్తే నీరు తాగించకుండా వీలైనంత త్వరగా దవాఖానకు తరలించాలని డాక్టర్లు చెబుతున్నారు.

#### వడదెబ్బతో ఒకరి మృతి


ముత్తయ్య(ఫైల్)

దహెగాం, మే 27: గిరివెల్లి గ్రామానికి చెందిన నిట్టూరి ముత్తయ్య(62) వడదెబ్బతో మృతి చెందాడు. సోమవారం ఉదయం పశుగ్రాసం తీసుకురావడానికి తన పొలం వద్దకు ఎడ్లబండిపై వెళ్లాడు. పశుగ్రాసం బండిలోకి ఎక్కిస్తున్న క్రమంలో వాంతులు చేసుకొని తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. సమీపంలోని రైతులు గమనించి అక్కడికి వెళ్లి చూడగా ముత్తయ్య అప్పటికే మృతిచెందాడు.

# సీజన్‌కు ముందే నకిలీ దందా

- పల్లెల్లో జోరుగా నకిలీ పత్తి విత్తనాల విక్రయాలు
- పక్క రాష్ట్రాల నుంచి దిగుమతి
- లైసెన్స్‌లు పొందిన డీలర్లే అసలు సూత్రధారులు
- ఇప్పటికే సుమారు 15 క్వింటాళ్ల దాకా పట్టివేత
- అరికట్టేందుకు ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు
- ఫర్టిలైజర్స్‌పై ప్రత్యేక నిఘా.. కొనసాగుతున్న తనిఖీలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 27(నమస్తే తెలంగాణ) : సీజన్‌కంటే ముందే పల్లెలో నకిలీ విత్తనాల దందా మొదలైంది. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, గుంటూరు, మహారాష్ట్రలోని పలు జిల్లాల నుంచి వివిధ మార్గాల ద్వారా దిగుమతి చేసి.. రైతులకు విక్రయిస్తూ అందినకాడికి దండుకోవడం ఆందోళన కలిగిస్తున్నది. పేరు..ఊరు లేని కంపెనీల్లో తయారైన విత్తనాల ప్యాకెట్లను అమాయక రైతులకు అంటగట్టి కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారు. విత్తనాలు తయారు చేసిన తేదీ.. వ్యాలిడిటీ తదితర వివరాలేవి ఉండడం లేదు. లైసెన్స్‌లు పొందిన దుకాణాదారులే వాటిని తెప్పించి గుట్టుచప్పుడు కాకుండా గ్రామాల్లోకి చేరవేస్తున్నట్లు తెలుస్తున్నది. పత్తి, కంది, వరి, సోయా అమ్ముకునే సమయంలో రైతుల వద్ద డబ్బులు ఉంటాయని భావించి ఈ దందాకు తెరలేపారు. లైసెన్స్‌లు పొందిన విత్తన వ్యాపారులే ఈ వ్యవహారం నడిపిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా పెడుతున్నారు.


ఇటీవల చింతలమానేపల్లి మండలం గూడెం వద్ద పట్టుబడ్డ 70 కిలోల నకిలీ పత్తి విత్తనాలు

#### నకిలీలపై నిఘా..

వివిధ రకాల కంపెనీల పేర్లతో నకిలీ విత్తనాలు అమాయక రైతులకు అంటగడుతున్న ముఠాలను పట్టుకునేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో ఎరువులు, విత్తనాలు అమ్మేందుకు లైసెన్స్‌లు పొందిన డీలర్లు 251 మంది ఉన్నారు. వీరు తమ దుకాణాల ద్వారా విత్తనాలు, ఎరువులు అమ్ముతున్నారు. పట్టుబడుతున్న నకిలీ విత్తనాలను లైసెన్స్ పొందిన వారే తెప్పిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. మండలాలతో ఏమాత్రం సంబంధం లేని అధికారుల బృందాలు దుకాణాలు తనిఖీ చేస్తున్నాయి. ప్రతి ఎరువుల దుకాణాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. జిల్లాలోకి నకిలీ విత్తనాలు ఎలా వస్తున్నాయి..? వాటి వెనుక ఎవరెవరు ఉన్నారనే విషయాలపై ఆరా తీస్తున్నాయి. ఆంధ్రలోని కర్నూల్, గుంటూరు, మహారాష్ట్రలోని పలు జిల్లాల నుంచి వివిధ మార్గాల ద్వారా కొరియర్ ద్వారా నకిలీ విత్తనాలు జిల్లాలోకి వస్తున్నాయి. ఇప్పటికే జిల్లాల నకిలీ విత్తనాలు పట్టుబడుతున్న ఘటనలు అనేకం ఉన్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు రూ. 12 లక్షల విలువైన 15 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పడ్డాయి. ఈ నేపథ్యంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్‌లలోని మండలాల్లో టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందాలు డీలర్ దుకాణాలను తనిఖీ చేస్తున్నాయి. జిల్లాలోని అమాయక రైతులను మోసగిస్తూ నకిలీ విత్తనాలను, ఎరువులను విక్రయిస్తున్న వారి గుట్టును పూర్తిగా బయటకు తీసేందుకు టాస్క్ ఫోర్స్ బృందాలు తనిఖీలు చేపడుతున్నాయి.

### గూడెం వంతెన అడ్డాగా..

- రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా నకిలీ విత్తనాలు సరఫరా
- ఈ ప్రాంతంలో పెద్ద మొత్తంలో డంపులున్నట్లు గుసగుసలు

చింతలమానేపల్లి , మే 27 : చింతలమానేపల్లి మండలం గూడెం అంతర్రాష్ట్ర వారధి కేంద్రంగా నకిలీ విత్తనాల దందా జోరుగా సాగుతున్నది. గతంలో మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నది మీదుగా పడవల్లో తెలంగాణకు నకిలీ పత్తి విత్తనాలు సరఫరా చేసిన దళారులు, ఇప్పుడు ప్రాణహితపై నిర్మించిన గూడెం వంతెనపై నుంచి రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. గూడెం, చింతలమానేపల్లి గ్రామాలను అడ్డాలుగా చేసుకొని ఈ దందా నడిపిస్తున్నట్లు తెలుస్తున్నది. అటు మహారాష్ట్రతో పాటు తెలంగాణలోని చింతలమానేపల్లి, బెజ్జూర్, కౌటాల, పెంచికల్‌పేట్, సిర్పూర్, కాగజ్‌నగర్ మండలాల్లో గ్లైసిల్ విత్తనాల నకిలీ దందా యథేచ్ఛగా సాగుతోంది. బుధవారం గూడెం ప్రాణహిత అంతర్రాష్ట్ర వంతెన వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేపట్టగా, 70 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. ఇంతపెద్ద మొత్తంలో నకిలీ గ్లైసిల్ పత్తి విత్తనాలు పట్టుబడగా, ఈ ప్రాంతంలో డంపులున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. 2020లో గంగాపూర్‌లో తనిఖీలు చేపట్టగా డోకె శ్రీనివాస్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 13 క్వింటాళ్లకు పైగా గ్లైసిల్ నకిలీ విత్తనాలను పట్టుకుని సీజ్ చేశారు. 2021లో తెలంగాణకు చెందిన కొందరు దళారులు మహారాష్ట్రలోని బొట్లచెరువు అనే గ్రామంలో 18 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు దాచి ఉంచగా, పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. పలువురిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. ఎరువుల డీలర్ల కనుసన్నల్లోనే ఈ దందా కొనసాగుతుందన్న గుసగుసలు వినిస్తున్నాయి. రైతులు డీలర్ల వద్దకు వెళ్లినప్పుడు నకిలీ పత్తి విత్తనాలు కొనుగోలు చేసేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తున్నది.

#### రైతులకు అవగాహన కరువు

క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నకిలీ దందా యథేచ్ఛగా సాగుతున్న రైతులకు అవగాహన కల్పించడం లేదు. ఏఈవోలు ఎప్పుడో ఓసారి కనిపిస్తారని, టాస్క్‌ఫోర్స్, పోలీసు అధికారులు పట్టుకుంటే తప్ప వ్యవసాయ శాఖ అధికారులు ఈ గ్లైసిల్ విత్తనాలు పట్టుకున్న దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు.



చింతలమానేపల్లి : పట్టుకున్న విత్తనాలు, నిందితుడితో పోలీసులు


చింతలమానేపల్లి : గంగాపూర్‌లో పట్టుబడ్డ గ్లైసిల్ విత్తనాలు


మహారాష్ట్రలో తెలంగాణ పోలీసులు పట్టుకున్న నకిలీ విత్తనాలు, నిందితులు


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

## నూతన చట్టాలపై అవగాహన అవసరం

### రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాల ఏసీసీ, మే 27: నూతన చట్టాలపై పోలీసు అధికారులు, సిబ్బందికి అవగాహన అవసరమని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి మంచిర్యాల జోన్ అధికారులు, సిబ్బందికి వర్కషాప్ ఆన్ న్యూ క్రిమినల్ లాస్ (ఎన్‌సీఎల్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూలై 1 నుంచి భారత ప్రభుత్వం నూతన నేర న్యాయ చట్టాలు అమల్లోకి తెస్తున్నదన్నారు. నూతన చట్టాలపై అవగాహన ఉంటేనే బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించాలి, ఏఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలి, స్టేషన్ బెయిల్‌కు ఎవరు అర్హులు, చార్జిషీట్ ఎలా తయారు చేయాలి, దర్యాప్తు ఎలా చేయాలి.. తదితర అంశాల గురించి తెలుస్తుందన్నారు. కొత్త చట్టాలపై నెల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

#### నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు, పీడీ యాక్ట్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు, పీడీ యాక్ట్ అమలు చేయనున్నట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అధికారులకు నకిలీ విత్తనాలు, నిషేధిత హెచ్‌టీ కాటన్ విత్తనాలను గుర్తించడంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయించినా, నిల్వ చేసినా, రవాణా చేసినా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విత్తనాలు, ఎరువుల దుకాణాలు, గోదాముల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనరేట్ పరిధిలోని ఉన్నతాధికారులు, సీఐ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత


పట్టుకున్న నకిలీ విత్తనాలతో ఎస్ఐ దీకొండ రమేశ్, ఏఈవో శోభారాణి

సిర్పూర్(టీ), మే 27 : భూపాలపట్నం గ్రామ శివారులో సోమవారం 20 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు సిర్పూర్(టీ) ఎస్ఐ దీకొండ రమేశ్ పేర్కొన్నారు. భూపాలపట్నంలో సోదాలు నిర్వహిస్తుండగా, చింతలమానేపల్లి మండలం గంగాపూర్‌కు చెందిన చాపిలే పురుషోత్తం రూ. 50 వేల విలువ చేసే 20 కిలోల నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తుండగా, స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఏఈవో శోభారాణి ఉన్నారు.

#### డబ్బాలో 3.25 క్వింటాళ్లు..

చింతలమానేపల్లి , మే 27 : డబ్బా గ్రామ శివారులో ఆదివారం రాత్రి 3.25 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాపతాప్ తెలిపారు. డబ్బాలో సోదాలు నిర్వహిస్తుండగా, సిర్పూర్ (టీ) మండలం భూపాలపట్నంకు చెందిన బొల్లబోయిన అశోక్ వద్ద సుమారు రూ.8 లక్షల విలువైన 3 క్వింటాళ్ల 25 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. సిర్పూర్ ఎస్ఐ దీకొండ రమేశ్, ఎస్ఐ వెంకటేశ్, కానిస్టేబుల్ మధు, రమేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

# పర్మిషన్ సరే.. నిబంధనలు పట్టవా?

- దొనబండ వెంచర్ల యజమానుల ఇష్టారాజ్యం
- జీపీకి రిజిస్ట్రేషన్, మార్టిగేజ్ చేయకుండానే మార్కెటింగ్
- ఓపెనింగ్ పేరిట భారీ కటౌట్లు.. విందులతో హడావుడి
- ప్లాట్లకు అడ్వాన్స్‌లు తీసుకుంటున్న వైనం
- నోటీసులిస్తాం : ఎంపీవో శ్రీనివాస్ రెడ్డి


దొనబండ శివారులో ఏర్పాటు చేసిన వెంచర్


విందుకు హాజరైన ఏజెంట్లు, కొనుగోలు దారులు

హాజీపూర్, మే 27 : మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం దొనబండ గ్రామ శివారులో పదుల సంఖ్యలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు చేస్తున్నారు. అందులో భాగంగా ఏజెంట్లను నియమించుకొని ప్లాట్ల కొనుగోలుదారులకు స్కీంల పేరుతో ఆశచూపుతున్నారు. గజం ధర రూ.10 వేల నుంచి 15 వేల వరకు అమ్ముతున్నారు. కొన్ని వెంచర్లు డీటీసీపీ లే అవుట్ చెబుతున్నా.. వాటికి నిజంగానే అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయంలో అధికారులకే స్పష్టత ఉండడం లేదు. దొనబండ శివారులోని 264/1/3, 308/7-1బీ/2, 308/8బీ/1/2 సర్వే నంబర్‌లో 10 ఎకరాల 33 గుంటల్లో డీటీసీపీ అప్రూవల్ అంటూ ఓ లే అవుట్ ఏర్పాటు చేశారు. ఆదివారం అట్టహాసంగా భారీ కటౌట్లు ఏర్పాటు చేసి ప్రారంభోత్సవం సైతం చేశారు. వచ్చిన వారికి విందు ఇచ్చారు. కొందరి వద్ద అడ్వాన్సులు సైతం తీసుకున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా పంచాయతీ అధికారులు మాత్రం ఈ వెంచర్‌పై తమకు ఎలాంటి సమాచారం లేదంటున్నారు. పంచాయతీకి 10 శాతం భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని, మరో 12 శాతం ప్లాట్‌లను మార్టిగేజ్ చేయాలనికానీ.. ఇప్పటి వరకు తమను ఎవ్వరూ సంప్రదించలేదని వారు చెబుతున్నారు. రిజిస్ట్రేషన్, మార్టిగేజ్ చేయకుండా ప్లాట్‌కు సంబంధించి ప్రమోషన్ చేసుకోవడం, అడ్వాన్సులు తీసుకోవడం నిబంధనలకు విరుద్ధమని వారు పేర్కొంటున్నారు. ఇవేవీ పట్టించుకోకుండా వెంచర్ నిర్వాహకులు ఓపెనింగ్ పేరుతో ప్లాట్‌లకు అడ్వాన్స్ బుకింగ్‌లు తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి.

#### ఎకరం రిజిస్ట్రేషన్ చేస్తారా..

డీటీసీపీలో మొత్తం భూమిలో 10 శాతం గ్రామ పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయాలి. కానీ చాలా మంది ఈ నిబంధనను పట్టించుకోవడం లేదు. చేయాల్సిన దానిలో సగమో, మూడోవంతు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసి అధికారులను మేనేజ్ చేస్తుంటారు. ఇప్పుడు ఈ వెంచర్ విషయానికి వస్తే 10 ఎకరాల్లో దాదాపు ఎకరం వరకు పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయాలి. ఇది పోనూ మొత్తం 123 ప్లాట్‌లలో 12 శాతం ప్లాట్‌లను పంచాయతీకి మార్టిగేజ్ చేయాలి. పర్మిషన్ తెచ్చుకున్నప్పటికీ నిబంధనల ప్రకారం ఈ మొత్తం గ్రామ పంచాయతీకి అప్పగిస్తారా... లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై వెంచర్ నిర్వాహకులను వివరణ కోరగా, అన్ని అనుమతులు తీసుకున్నామనే ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. పంచాయతీకి త్వరలోనే రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామంటున్నారు.

#### జీపీకి భూమి రిజిస్ట్రేషన్ చేయలేదు

దొనబండ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన వెంచర్ యజమానులు నేటి వరకు గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఎలాంటి భూమిని రిజిస్ట్రేషన్ చేయలేదు. ఈ విషయమై వారిని అడిగితే డీటీసీపీ లే అవుట్ అనుమతికి పోతున్నామన్నారు. లే అవుట్‌కు పోతే సంబంధిత పత్రాలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇచ్చి, నింబంధనల ప్రకారం కొంత భూమిని రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వాలి. లేదంటే నోటీసులు ఇస్తాం. మాకు రిజిస్ట్రేషన్ చేశాకే ప్రమోషన్లు చేసుకోవాలి. అడ్వాన్స్‌లు తీసుకోవాలి. నిబంధనలు పాటించని పక్షంలో చర్యలకు సిఫార్సు చేయాల్సి వస్తది.

– శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో, హాజీపూర్


పట్టణంలో విత్తనాల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి సురేఖ

## రైతులు మోసపోవద్దు

### జిల్లా వ్యవసాయశాఖ అధికారి సురేఖ

చెన్నూర్ రూరల్, మే 27: రైతులు నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ అన్నారు. సోమవారం లింగపల్లి, కాంబోజిపేట గ్రామాల్లో రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. విత్తనాలు కొనేటప్పుడు దుకాణాల నుంచి రశీదులు తప్పనిసరిగా తీసుకోవాలని, పంటలు చేతకొచ్చేదాకా వాటిని భద్రపరుచుకోవాలని సూచించారు. చెన్నూర్ పట్టణంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు. ప్రతి రోజూ నకిలీ విత్తనాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని ఏవోకు సూచించారు. ఆమె వెంట ఏవో మార్క్ గ్లాడిస్టన్, ఏఈవోలు సాగర్, రాజశేఖర్. వనదేవి, దివ్య, శివరంజని ఉన్నారు.


కాంబోజిపేటలో రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి సురేఖ